క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో దామోదర కల్యాణం



ఆత్మకూరు: పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పంటవీధి కోదండ రామాలయంలో తులసీదామోదర కల్యాణాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం, కాశీనాయన ఆశ్రమంలోని శివాలయం, అలఘనాథస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

కేజీబీవీలో తనిఖీలు



కలిగిరి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని సర్వశిక్ష అభియాన్ జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సీహెచ్ ఉషారాణి శనివారం తనిఖీ చేశారు. విద్యార్థుల పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, బైజూస్ ట్యాబ్‌లను పరిశీలించి విద్యా బోధనపై ఆరాతీశారు. అనంతరం భోజనం నాణ్యతను పరిశీలించారు. ఆమె వెంట జీసీడీఓ మమత, ప్రిన్సిపల్ సుప్రియ, తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో తనిఖీలు



ఉదయగిరి: పట్టణంలోని దళితవాడ, షబ్బీర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓలు షేక్ మస్తాన్‌వలి, తోట శ్రీనివాసులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలించారు. విద్యార్థుల వర్క్‌బుక్‌లను ప్రతిరోజూ పరిశీలించి తప్పులను తెలియజేసి సరిచేయించడంతో పాటు తేదీలు నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో రెండ్రోజుల వ్యవధిలో మృతి చెందిన వారి అంత్యక్రియలకు శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి శనివారం రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. 14వ వార్డు నారాయణరావుపేటకు చెందిన షేక్ ఖాజావలి, 6వ వార్డు ఆచారివీధికి చెందిన ఎస్ వెంకటేశ్వర్లు, 12వ వార్డు అరుంధతీయపాళేనికి చెందిన ఉసురుపాటి రామ్మూర్తి, 19వ వార్డు ఏసీఎస్ఆర్ కాలనీకి చెందిన ఎస్ పెంచలయ్య మృతి చెందగా వారి కుటుంబాలకు రూ.10 వేలు చొప్పున చెక్కులు అందజేశారు. ఆయన వెంట 19వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కొండా వెంకటేశ్వర్లు, ఎస్‌జీఓ వాగాల శ్రీహరి, మెప్మా ఆర్పీలు సమీన, నాగరాణి, శాంతి, ట్రస్ట్ సభ్యులు యానాదిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి సహకారం



కలిగిరి: పంచాయతీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి తెలిపారు. కలిగిరిలోని గ్రామ సచివాలయంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, ఎంపీడీఓ జీ వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్డీ మధు, పంచాయతీ కార్యదర్శులు కృష్ణారెడ్డి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రేపు శివుడికి మహాభస్మాభిషేకం

ఉదయగిరి: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని గండిపాళెంలోని సిద్ధేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన పర్వమేశ్వరుడికి సోమవారం మహాభస్మాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఎల్‌వీ ప్రసాద్‌శాస్త్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరమేశ్వరుడికి 21 కేజీల భస్మంతో అభిషేకం, పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

సంక్షేమ సారథి జగనన్న

- దోపిడీ దొంగలకు సారథి చంద్రబాబు
- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: 14 ఏళ్ల చంద్రబాబు పాలన, నాలుగున్నరేళ్ల జగనన్న పాలనలోని తేడాను గమనిస్తే సంక్షేమ సారథిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలవగా, దోపిడీ దొంగలకు సారథిగా చంద్రబాబు నిలిచారని స్పష్టమవుతోందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 34వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం ఆయన నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామిరెడ్డి మాట్లాడుతూ నేడు అవ్వాతాతలు రూ.2,750, దివ్యాంగులు రూ.3,500 పింఛన్ అందుకుంటున్నారని తెలిపారు. చంద్రబాబు సీఎంగా పనిచేసినప్పుడు రూ.70 ఉన్న పింఛన్‌ను కనీసం రూ.10 అయినా పెంచాడా? అని ప్రశ్నించారు. 2019 ఎన్నికలకు రెండు నెలల ముందు చంద్రబాబు 30 లక్షల మందికి రూ.వేయి పింఛన్ ఇస్తే, ఇప్పుడు జగనన్న రూ.2,750 చొప్పున 64 లక్షల మందికి ఇస్తున్నారని తెలిపారు. ఫీజురీయింబర్స్‌మెంట్‌కు తూట్లు పొడిచిన చంద్రబాబు 30 శాతం శ్లాబ్ విధించి 70 శాతం తల్లిదండ్రులు కట్టుకోవాలని విద్యార్థులను గాలికొదిలేశాడని గుర్తుచేశారు. మళ్లీ జగనన్న అధికారంలోకి వచ్చాక దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో మాదిరిగా ఫీజురీయింబర్స్‌మెంట్ ఇస్తున్నారని తెలిపారు. జగనన్న అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లకే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి 1.40 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చి దేశానికే దిక్సూచిగా నిలిచారని తెలిపారు. ఇవన్నీ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా చేయలేదంటే అందుకు కారణం ఆయన, ఆయన పెత్తందారులు, టీడీపీ నాయకులు రాష్ట్రాన్ని దోచుకోవడమేనన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగనన్నదేనన్నారు. వెనుకబడిన కులాలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చిన జగనన్న వైపు దేశం మొత్తం చూస్తోందన్నారు. బాబుకే గ్యారెంటీ లేదని, ఆయన ఇంకేం రాష్ట్ర ప్రజలకు గ్యారెంటీ ఇస్తాడని ప్రశ్నించారు. బాబు గ్యారెంటీల్లోనూ జగనన్న స్ఫూర్తి ఉందన్నారు. ప్రజాసంకల్ప యాత్ర ద్వారా ప్రజల కష్టాలను దగ్గర నుంచి చూసిన జగనన్న నాలుగున్నరేళ్లలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని తెలిపారు. చంద్రబాబు పేరు చెబితే ఏ పథకమూ గుర్తుకురాదని, కేవలం వెన్నుపోటు ఒక్కటే గుర్తుకొస్తుదని విమర్శించారు. 2014లో మద్దతు పలికి, 2019లో చంద్రబాబును తిట్టిన పవన్ కళ్యాణ్ 2024లో మళ్లీ చంద్రబాబుతో పొత్తుపెట్టుకుని మంచోడని సర్టిఫికెట్ ఇస్తున్నాడని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ రంతుల్లా, షేక్ కరిముల్లా, ఇర్మియా ప్రభాకర్, షేక్ ఖాలేషా, పాశం శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

2025 నాటికి క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి



క్షయ రోగులకు పోషకాహార కిట్లు అందజేస్తున్న ఖాదర్‌వలి

ఉదయగిరి: 2025 నాటికి జిల్లాను క్షయ రహితంగా తీర్చిదిద్దేందుకు వైద్యారోగ్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా కుష్టు, ఎయిడ్స్, క్షయ వ్యాధుల నియంత్రణాధికారి ఖాదర్‌వలి అన్నారు. పట్టణంలోని గల్ల పరీక్షా కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి రోగులను అడిగి వైద్యసేవలు అందిస్తున్న తీరును తెలుసుకున్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు అందజేశారు. అనంతరం సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి టీబీ యూనిట్ పరిధిలో 63 మంది క్షయ వ్యాధిగ్రస్తులు చికిత్స పొందుతున్నారని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులు భయపడాల్సిన పనిలేదని, ఆరోగ్య శాఖ అందించే మందులను క్రమం తప్పకుండా ఆరు నెలలు వాడితే పూర్తిగా నయమవుతుందన్నారు. ఉదయగిరి గల్ల పరీక్ష కేంద్రంలో వసతులు బాగున్నాయని, రోజువారీ గల్ల పరీక్షలను పెంచాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో రెండు వారాలకు మించి దగ్గు ఉన్న వారిని సిబ్బంది గుర్తించి గల్ల పరీక్షా కేంద్రానికి పంపాలని ఆదేశించారు. ఆయన వెంట మండల వైద్యాధికారిణి ఎం శివకల్పన, ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య, క్షయ నియంత్రణ జిల్లా సీనియర్ సూపర్‌వైజర్ సీ విజయ్, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ మురళి, పర్యవేక్షకులు భోగ్యం వెంకటేశ్వర్లు, చెన్నయ్య, తదితరులు ఉన్నారు.

సాగునీటి యాజమాన్యంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సుజాత

సంగం: మండలంలోని జెండాదిబ్బ రైతు భరోసా కేంద్రంలో సాగునీటి యాజమాన్యంపై శనివారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ సుజాత మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వరి పంట సాగుచేసే రైతులు ఎన్ఎల్ఆర్ 34449, కేఎన్ఎం 1638, ఎన్ఎల్ఆర్ 3354, ఆర్ఎన్ఆర్ 15048, తదితర స్వల్పకాలిక రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల 15లోగా నాట్లు వేసుకుంటే పంట అనుకూలంగా ఉంటుందని తెలిపారు. వ్యవసాయాధికారి శ్రీహరి మాట్లాడుతూ డ్రమ్స్ సీడర్, వెదజల్లే పద్ధతిలో నాట్లు వేసుకుంటే పదిరోజులు ముందుగానే పంట కోతకు వస్తుందని రు. వీఏఏ రాజేశ్వరి, సర్పంచ్ శంకరయ్య, రైతులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత



ఉదయగిరి:మాట్లాడుతున్న ఎంపీడీఓ ఈశ్వరమ్మ



మర్రిపాడులో పొదుపు మహిళల ర్యాలీ

ఉదయగిరి: సమాజంలో బాలికలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎంపీడీఓ ఈశ్వరమ్మ అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో బాలికల సంరక్షణపై వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామ, మండలస్థాయి కమిటీలు బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సీడీపీఓ లావణ్య, ఎంఈఓ శ్రీనివాసులు, ఏపీఎం ఖాజారంతుల్లా, ఏఎస్సై శ్రీనివాసులు, ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడు: జెండర్ ఆధారిత హింసను విడనాడాలని కోరుతూ మర్రిపాడులో పొదుపు మహిళలు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ఏపీఓ బుజ్జమ్మ ఆధ్వర్యంలో స్త్రీశక్తి భవనం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా అవగాహన కలిస్తూ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో గ్రామీణ పేదరిక నిర్మూలన, బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు.

మహిళలపై హింసకు వ్యతిరేకంగా పోరాడాలి

కావలి : సమాజంలో పెరిగిపోతున్న మహిళలపై హింసకు వ్యతిరేకంగా ప్రతిఒక్కరూ పోరాడాలని కావలి పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల రమణయ్య అన్నారు. అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పెన్షనర్స్ అసోసియేషన్, కావలి ఉమెన్ ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలపై హింసను వ్యతిరేకించడమనే స్ఫూర్తిని ప్రతిఒక్కరిలో కలిగించాలనే లక్ష్యంతో ఏటా అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావలి ఉమెన్ ఫోర్స్ కన్వీనర్ సీ శారద తన సభ్యులతో కలసి మహిళలు, బాలికలపై జరుగుతున్న పలు రకాల హింసకు వ్యతిరేక పోరాటాలు చేస్తుండడం అభినందనీయమన్నారు. సీ శారద మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా నేటికి మనదేశంలో రెండో తరగతి పౌరురాలిగానే గుర్తించబడుతున్నారన్నారు. వారు మాన, ప్రాణ రక్షణ లేకుండా అభద్రతా భావంతో బతకడం యావత్ దేశానికే అవమానకరమన్నారు. మహిళలకు ఎలాంటి అన్యాయం జరిగినా ప్రతిఒక్కరూ మద్దతిచ్చి తమ మానవతను, గౌరవాన్ని వ్యక్తం చేయాలని కోరారు. గృహ హింస నిరోధక చట్టం, దిశ, పోక్సో చట్టాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి సాయిరామ్ సింగ్, ట్రెజరర్ వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు రఘురామ్ ,కృష్ణారావు, సుకన్య, కావలి ఉమెన్ ఫోర్స్ సభ్యులు సుజాత, జమున, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ పరిశీలన



చేజర్ల: మండల కేంద్రమైన చేజర్లలోని జగనన్న కాలనీని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి శనివారం సందర్శించారు. గృహ నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట వర్క్‌ఇన్‌స్పెక్టర్ నజీర్, సర్పంచ్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



కావలి : మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరణకు పాడైపోయిన డంపర్‌బిన్ల స్థానంలో కొత్తగా 14 డంపర్‌బిన్లను కొనుగోలు చేసి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కో డంపర్ బిన్‌ను రూ.35 వేల ఖర్చుతో ఏర్పాటు చేశామని వివరించారు. గృహాల నుంచి సేకరించిన చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా కొత్తగా ఏర్పాటు చేసిన డంపర్ బిన్లలో వేయాలని పారిశుధ్య కార్మికులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. వ్యాపారులు తమ దుకాణాల్లోని చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా రాత్రి వేళల్లో వచ్చే చెత్త సేకరణ వాహనంలో వేసి పారిశుధ్యానికి సహకరించాలని కోరారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జడ్జి రాజేష్

ఆత్మకూరు: ఆత్మకూరు కోర్టులో వచ్చే నెల 9వ తేదీ జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి బీ రాజేష్ పోలీసులు, న్యాయవాదులు కోరారు. పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఆత్మకూరు డివిజన్ పరిధిలోని పోలీసు స్టేషన్ల ఎస్సైలు, సీఐలు, న్యాయవాదులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీకి వీలైన కేసులను సత్వరమే పరిష్కరించనున్నట్లు తెలిపారు. కక్షిదారులకు అవగాహన కల్పించి ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. సీఐలు జీ వేణు, రవినాయక్, ఎస్సైలు ముత్యాలరావు, సంతోష్‌కుమార్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, నాయక్, బార్ కౌన్సిల్ సభ్యులు, న్యాయవాదులు రమణయ్య, వెంకటేశ్వర రావు, చిన్నారెడ్డి, నందా ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన కొమ్మలేరు, కేతామన్నేరు వాగులు



నీట మునిగిన వరినారు మడులు



కొత్తపల్లి-కచిరిదేవరాయపల్లి మార్గంలో చప్టాపై ప్రవహిస్తున్న కొమ్మలేరు వాగు

సోమశిల: రెండ్రోజులుగా విస్తారంగా కురిసిన వర్షాలతో అనంతసాగరం మండలంలోని కొమ్మలేరు, కేతామన్నేరు వాగులు ఉప్పొంగాయి. శుక్ర, శనివారాల్లో కురిసిన వర్షాలతో మర్రిపాడు మండలం నుంచి వచ్చే కొమ్మలేరు వాగు ఉద్ధృతంగా ప్రవహించింది. కొత్తపల్లి–కచిరిదేవరాయపల్లి మధ్యన చప్టాపై నీటి ప్రవాహం కొనసాగడంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. కొత్తపల్లి, ముత్తుకూరు, మినగల్లు గ్రామాల పొలాల్లోకి నీరు చేరడంతో నారుమడులు మునిగాయి. కొమ్మలేరు వాగులో పూడికతీత చేపడితే ముంపు సమస్య ఉండదని రైతులు తెలిపారు. అధికారులు స్పందించి పూడికతీత పనులు చేపట్టాలని కోరారు.

ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించాలి



అల్లూరు: మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్



చేజర్ల: ఆత్మకూరు ఆర్డీఓను సన్మానించిన ఎంపీపీ



సంగం: బీఎల్వోలతో మాట్లాడుతున్న ఆత్మకూరు ఆర్డీఓ మధులత

ఆత్మకూరు ఆర్డీఓ కే మధులత

చేజర్ల: ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించాలని ఆత్మకూరు ఆర్డీఓ కే మధులత బీఎల్వోలకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్వోల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా ఓటర్ల జాబితాను రూపొందించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఎవరైనా ఓటర్లు మృతి చెంది ఉంటే విచారణ జరిపి తొలగించాలని సూచించారు. ఓట్ల మార్పు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అనంతరం నేషనల్ హైవే 67కు సేకరించిన భూములకు సంబంధించి అవార్డులపై చర్చించారు. కాగా ఆత్మకూరు ఆర్డీఓను ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ్, ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

సంగం: మండల తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో ఆత్మకూరు ఆర్డీఓ మధులత శనివారం సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా రూపొందించడంపై సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటిస్తూ పారదర్శకంగా ఓటర్ల జాబితాను రూపొందించాలని సూచించారు. జీరో డోర్ నంబర్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒకే ఇంట్లో పది కంటే ఎక్కువ ఉన్న, మృతులు, బదిలీ ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, అశోక్‌కుమార్, ఆర్ఐ రాజనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా పరిశీలన

అల్లూరు: బీఎల్వోలు ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ చంద్రశేఖర్ సూచించారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన బీఎల్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలోని ఓటర్లు ఉన్నారా..లేదా అని పరిశీలించాలన్నారు. ఎవరైనా చనిపోయిన, వలస వెళ్లి ఉన్నా వారి ఓట్లను తొలగించాలని సూచించారు. కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పరిశీలించాలన్నారు. కమిషనర్ ఫణికుమార్, సీనియర్ అసిస్టెంట్ సుధీర్, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'ను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరురూరల్: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో 'ఆడుదాం ఆంధ్ర'పై సచివాలయ సిబ్బందితో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ 15 ఏళ్లు పైబడిన బాలబాలికలు క్రీడల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 27 నుంచి డిసెంబరు 2వ తేదీలోగా గ్రామ సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. డిసెంబరు 11 నుంచి ప్రతి సచివాలయం పరిధిలో పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేసి మండల స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు.

ఐక్యంగా గ్రామాభివృద్ధికి పాటు పడాలి




కాలనీవాసులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

ఉదయగిరి: గ్రామస్తులు ఐక్యంగా ఉండి గ్రామాభివృద్ధికి పాటుపడాలని సీఐ వేల్పుల గిరిబాబు, ఎస్సై ఇంద్రసేనారెడ్డి సూచించారు. మండలంలోని కుర్రపల్లి బీసీ కాలనీవాసులతో శనివారం వారు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు పోలీసులంటే భయాన్ని తొలగించుకుని తమతో మమేకం కావాలని సూచించారు. సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప వివాదాలకు పాల్పడి కేసులు పెట్టుకుని సమయం వృథా చేసుకోవద్దన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండాలన్నారు. సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మల్లెంకొండ క్షేత్రంలో విశేష పూజలు

మర్రిపాడు: మండలంలోని మల్లెకొండ క్షేత్రంలో కార్తీక పౌర్ణమి ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రాజుపాళేనికి చెందిన బీజేపీ నేత సుబ్బరాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో తొలిరోజు గంగానయనం, గంగాహారతి, సకల దేవతలకు ఆహ్వానం, విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం పార్థీవ లింగానికి విశేషాభిషేకాలు, కుంకుమార్చన, జ్వాలాతోరణం, దీపాలంకరణ, 27న మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, విశేష హోమాలు నిర్వహించనున్నారు.

అడవిని తలపిస్తున్నా పట్టించుకోరా..



బిట్రగుంట: బోగోలు మండలం కప్పరాళ్ల తిప్పలోని ప్రభుత్వ కార్యాలయాల మధ్య చిల్లచెట్లు అడవిని తలపిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. తహసీల్దార్, , ఎంపీడీఓ కార్యాలయాల మధ్యన ఉపాధిహామీ, డ్వాక్రా, వ్యవసాయశాఖ కార్యాలయాలు ఉన్నాయి. వ్యవసాయశాఖ కార్యాలయం నుంచి ఉపాధిహామీ కార్యాలయ భవనం వరకు ఉన్న ఖాళీ స్థలంలో చిల్లచెట్లు, పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి అడవిని తలపిస్తున్నాయి. దీంతో తరచూ విషసర్పాలు కూడా సంచరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. మండల స్థాయి అధికారులు నిత్యం విధులు నిర్వహించే ప్రాంతంలోనే చిల్లచెట్లు అడవిలా పెరుగుతుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల నడుమే పరిశుభ్రత లేకపోవడంపైయంత్రాంగం పరువుపోతున్నా పట్టించుకోవడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి చిల్లచెట్లు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

దర్గాకు చాపల అందజేత

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి మజరా ఖాన్‌సాహెబ్‌పేటలోని అలీబొలియా దర్గాకు నాగినేనిగుంటకు చెందిన షేక్ మీరావలి కుటుంబ సభ్యులు శనివారం చాపలు అందజేశారు. జనవరి 5న దర్గాలో 21 కిలోల బంగారు పీరును ప్రతిష్ఠించనున్నారు. అందుకోసం దర్గా పీఠాధిపతి బంధా నవాజ్ బాబా సోమవారం నుంచి 41 రోజుల పాటు ఉపవాస దీక్ష చేపట్టనున్నారు. జనవరి 5న ఖాన్‌సాహెబ్‌పేటలోని బంట్లపల్లి క్రాస్ వద్ద నుంచి గంగమ్మ గుడి మీదుగా పీఠాధిపతి నవాజ్ బాబా మోకాళ్లపై నడుస్తూ వెళ్తుండగా భక్తులు ఊరేగింపుగా బంగారుపీరును దర్గాకు తీసుకెళ్లనున్నారు. పీఠాధిపతి మోకాళ్లపై నడిచేందుకు వీలుగా షేక్ మీరావలి కుటుంబసభ్యులు చాపలు అందజేశారు.